సాక్షి విశాఖపట్నం

ఆదివారం । 24 । సెప్టెంబర్ । 2023



వచ్చే ఏడాదీ గోల్ఫ్ టోర్నీ

వైజాగ్ ఓపెన్ టోర్నీ వచ్చే ఏడాది నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్‌రెడ్డి సూచించారు. 8లో



బై.. బై.. గణేశా..

పెదజాలరిపేట వద్ద సముద్రంలో వినాయకుడి విగ్రహాలను శనివారం రాత్రి వేడుకగా నిమజ్జనం చేశారు. 8లో



ఆ మండలాలకూ మాస్టర్‌ప్లాన్

వీఎంఆర్‌డీఏ పరిధిలో చేర్చిన మండలాలకు సంబంధించి మాస్టర్ ప్లాన్ రూపొందించాలని సీఎస్ జవహర్ రెడ్డి సూచించారు. 12లో

న్యూస్‌రీల్

ఎన్టీపీసీ సింహాద్రికి ఎక్సలెన్స్ పీఆర్‌సీఐ అవార్డులు



అవార్డు అందుకుంటున్న ఎన్టీపీసీ ప్రతినిధి అఖిలేష్ త్రిపాఠి

పరవాడ: ఎన్టీపీసీ సింహాద్రి 2023 సంవత్సరానికి గాను ప్రతిష్టాత్మక పబ్లిక్ రిలేషన్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నుంచి రెండు రంగాల్లో పీఆర్‌సీఐ ఎక్సలెన్స్ అవార్డులు సొంతం చేసుకుంది. ప్రాంతీయ హౌస్ జనరల్ ప్రింట్ విభాగంలో స్వర్ణ పతకాన్ని, కార్పొరేట్ సామాజిక బాధ్యతగా పిల్లల సంరక్షణ కోసం చేపట్టిన ప్రాజెక్టుకు కన్సోలేషన్ బహుమతిని దక్కించుకుంది. న్యూఢిల్లీలో ఈ నెల 22న జరిగిన పీఆర్‌సీఐ గ్లోబల్ కమ్యూనికేషన్ ప్రత్యేక సమావేశంలో ఎన్టీపీసీ తరఫున కార్పొరేట్ కమ్యూనికేషన్ ఎగ్జిక్యూటివ్ అఖిలేష్ త్రిపాఠి ఈ అవార్డులు అందుకున్నారు.

ఈఎన్‌టీ సూపరింటెండెంట్‌గా డాక్టర్ హరికృష్ణ



ఏయూక్యాంపస్: ప్రభుత్వ చెవి, ముక్కు, గొంతు(ఈఎన్‌టీ) ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా సీనియర్ వైద్యుడు డాక్టర్ జి.హరికృష్ణ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆస్పత్రి విభాగాధిపతిగా కూడా ఆయన సేవలు అందిస్తున్నారు. ఇప్పటి వరకు ఇక్కడ సూపరింటెండెంట్‌గా సేవలందించిన డాక్టర్ జీవన్ ప్రదీప్ ఉద్యోగోన్నతిపై గుంటూరుకు బదిలీ అయ్యారు. ఆంధ్రా మెడికల్ కళాశాలలో దాదాపు 24 ఏళ్ల పాటు డాక్టర్ జి.హరికృష్ణ ప్రొఫెసర్‌గా సేవలందించారు. ఓ ఏడాది పాటు కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో ప్రొఫెసర్‌గా సేవలందించారు. ఇటీవల బదిలీపై ఈఎన్‌టీ ఆస్పత్రికి వచ్చారు. ఆస్పత్రి అభివృద్ధికి, రోగులకు పూర్తి స్థాయిలో సేవలు అందించేందుకు కృషి చేస్తానన్నారు.

నేడు రాష్ట్ర స్థాయి గ్రాప్లింగ్ రెజ్లింగ్ పోటీలు

మధురవాడ : రాష్ట్ర స్థాయి గ్రాప్లింగ్ రెజ్లింగ్ పోటీలు ఆదివారం మధురవాడలోని చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు ప్రధానోపాధ్యాయుడు ఎం.రాజబాబు చెప్పారు. శనివారం పాఠశాలలో జిల్లా గ్రాప్లింగ్ రెజ్లింగ్ అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి ఆయన విలేకరులతోమాట్లాడుతూ ఒక్క రోజు నిర్వహించే ఈ పోటీలు పాఠశాల మైదానంలో ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతాయన్నారు. ఈ పోటీలకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి 250 మంది వరకు క్రీడాకారులు హాజరవుతారని చెప్పారు. ఇక్కడ గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ గెలుచుకున్న క్రీడాకారులు ఈ నెల 28 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు హర్యానాలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని నిర్వాహకులు చెప్పారు. ఇందులో జిల్లా గ్రాప్లింగ్ రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బగాది జగదీశ్వరరావు, కార్యదర్శి మురళి పాల్గొన్నారు.

బీసీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రామన్నపాత్రుడు

డాబాగార్డెన్స్: ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా విశాఖ జిల్లాకు చెందిన కంట్రెడ్డి రామన్నపాత్రుడు నియమితులయ్యారు. ఈ మేరకు జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మారేసు శనివారం ఆయనకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామన్నపాత్రుడు మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను సమర్థంగా నిర్వహిస్తానని.. బీసీల సంక్షేమం, అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తానన్నారు. రాష్ట్ర బీసీ సంఘంలో ఉపాధ్యక్షుడిగా చోటు కల్పించినందుకు ఆర్.కృష్ణయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కొటాన రాము, కన్వీనర్ పితాని ప్రసాద్‌కు ధన్యవాదాలు చెప్పారు.

ఇదీ ముదపాక బండారుం



ముదపాక భూములు



దొంగే దొంగ అన్నట్టు ఉంది తెలుగుదేశం నేతల వ్యవహారం. టీడీపీ ప్రభుత్వ హయాంలో విశాఖలో భారీగా భూములను కబ్జా చేసి.. భూ రికార్డులను సైతం ట్యాంపరింగ్ చేసిన ఆ పార్టీ నేతలు ఓ వెలుగు వెలిగారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ నేతల భూ కబ్జాలను ఎండగడుతూ వేల కోట్ల విలువైన భూములను తిరిగి ప్రభుత్వ భూ బ్యాంకులోకి చేర్చింది. గతంలో జరిగిన తప్పుడు సర్వేలను సరిచేస్తూ.. అర్హులకు న్యాయం చేసేలా ముందుకు సాగుతోంది. గత ఎన్నికల ముందు వైఎస్సార్ సీపీ నేతలు భూకబ్జాలు చేస్తున్నారంటూ తప్పుడు ఆరోపణలతో కొంత మేర లబ్ధి పొందిన టీడీపీ.. ఇప్పుడు ఎన్నికల ముందు అదే పంథాను అవలంబిస్తోంది. ఈ నేపథ్యంలో వాస్తవ విషయాలను ప్రజలకు వివరించేందుకు.. టీడీపీ నేతల భూదందాపై 'సాక్షి' వరుస కథనాలు అందించాలని నిర్ణయించింది. మొదటగా ముదపాక భూముల వ్యవహారంలో తప్పుడు జియోకాన్ సర్వేతో టీడీపీ నేతలు ఏ విధంగా చక్రం తిప్పారో ఇప్పుడు చూద్దాం.. – సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం

- ముదపాక భూములను కొట్టేసేందుకు గత ప్రభుత్వం పన్నాగం
- టీడీపీ కార్యకర్తలు, నాయకులు పేర్లను సర్వేలో చేర్చిన వైనం
- అప్పటి ఎమ్మెల్యే బండారు కనుసన్నల్లోనే జియోకాన్ సర్వే
- ఇప్పటికీ ఆ భూములను కొల్లగొట్టేందుకు యత్నాలు
- అందుకే జగనన్న కాలనీలకు అడ్డు తగులుతున్న టీడీపీ నేతలు

పెందుర్తి మండలం ముదపాకలో 1, 38, 76 సర్వే నంబర్లలో సుమారు 955 ఎకరాల అసైన్డ్ భూములున్నాయి. ఆయా భూములను 40 ఏళ్ల కిందట 450 మంది రైతులకు కేటాయిస్తూ పట్టాలు జారీ చేసింది. నాటి నుంచి ముదపాక, శివారు గ్రామం గోవిందపురం రైతులు ఆ భూముల్లో జీడి మామిడి, ఇతర పంటలు వేసి ఫలసాయం పొందేవారు. 2014లో టీడీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ భూములకు గ్రహణం పట్టింది. 2015–16లో వీఎంఆర్డీఏ(అప్పట్లో వుడా) ఆయా భూములను ల్యాండ్ పూలింగ్ చేస్తుందన్న సమాచారంతో టీడీపీ నేతలు రంగంలోకి దిగారు. ల్యాండ్ పూలింగ్ ప్రకటన రాకముందే పక్కా ప్రణాళిక రచించారు. స్థానికంగా ఉన్న తమ బినామీల సాయంతో 'త్వరలో ప్రభుత్వం మీ భూములను లాక్కొంటుంది. అప్పుడు ఎకరాకు రూ.2 లక్షలకు మించి ఇవ్వదు. అదే మాకు ఆ భూములు ఇచ్చేస్తే రూ.10 లక్షలు ఇస్తాం' అని రైతులను ఆందోళనకు గురిచేసేలా ప్రచారం చేశారు. దీంతో అయోమయానికి గురైన రైతులు బినామీలు చెప్పినట్లే అడ్వాన్స్ కింద రూ.లక్ష, రెండు లక్షల చొప్పున తీసుకుని వారు ఎక్కడ సంతకాలు పెట్టమంటే అక్కడ పెట్టేశారు. దాదాపు 320 పట్టాలను ఇలా తెగనమ్ముకున్నారు. సుమారుగా 500 ఎకరాల భూములను మొత్తంగా రూ.10కోట్ల వరకు విక్రయించేశారు. వాస్తవంగా వీఎంఆర్‌డీఏ ధర ప్రకారం ఆ భూముల విలువ రూ.200కోట్లకు పైనే ఉంటుంది.

సర్వేలోనే మాయాజాలం

'ముదపాక అసైన్డ్ భూములకు సంబంధించిన రికార్డులు మాయమయ్యాయి. ఇక్కడ ఎన్ని ఎకరాల భూములన్నాయి.? ఎంత మంది రైతులకు ఆ భూములు కేటాయించారన్నది తెలియడం లేదు. ఆ రికార్డులు వెతికే పనిలో ఉన్నాం.' అని చెబుతూ ప్రభుత్వ ఆదేశాలతో జియోకాన్ సంస్థతో కలిసి అప్పటి అధికారులు సర్వే నిర్వహించారు. అయితే ఈ సర్వేలోనే అసలైన మాయాజాలం చోటుచేసుకుంటోంది. అప్పటి ప్రభుత్వం అండతో టీడీపీ నేతలు రైతులను భయపెట్టి లాక్కొన్న పట్టాలకు.. పుట్టుకొచ్చిన నకిలీ పట్టాదారులకు లబ్ధి చేకూర్చేలా సర్వే నిర్వహించారనే అనుమానాలు వ్యక్తమయ్యాయి.

రికార్డుల మాయాజాలం

ఈ విషయం తెలుసుకున్న అధికార యంత్రాంగం.. ముదపాక రికార్డులను పరిశీలించేందుకు ప్రయత్నించింది. అయితే సర్వే నంబర్లు 1, 38, 76లకు సంబంధించిన ఏ రికార్డులు లేవని స్థానిక రెవెన్యూ అధికారులు అసలు విషయం చెప్పారు. దీంతో చేసేదిలేక ఆ రికార్డులు లేవని ప్రకటన చేస్తూ.. ఆ భూముల్లో ప్రస్తుతం అనుభవంలో ఉన్న రైతుల ఆధారంగా సర్వే చేసి అందరికీ న్యాయం చేస్తామని అధికారులు ప్రకటించారు. కానీ.. మరుసటి రోజే సర్వే నంబర్లు 1, 38లకు సంబంధించిన రికార్డులు లభించినట్లు ప్రచారం జరిగింది. వివాదానికి కేంద్ర బిందువైన సర్వే నంబర్ 76 రికార్డులపై స్పష్టత లభించలేదు. ఈ సర్వే నంబర్‌లోని భూముల్లోనే ఆక్రమణదారులు అక్రమంగా చెట్లు నరికేయడంతో పాటు రోడ్లు వేశారు. ఇదే సర్వేలోని భూముల నుంచి ఆక్రమణ పర్వానికి తెరతీశారు. అందుకే 76 సర్వే నంబర్ రికార్డులు మాయమయ్యాయని స్పష్టమవుతుంది.

అంతా ఆయన కనుసన్నల్లోనే..

2017–2018 సంవత్సరంలో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం భూమి లేని పేదలకు గృహ నిర్మాణ పథకం కోసం ల్యాండ్ పూలింగ్ చేయాలని నిర్ణయించింది. ముదపాకలోని సర్వే నంబర్ 1, 76, 38లో అసైన్డ్‌దారులు, ఆక్రమణదారుల అంగీకారం తీసుకొని ఆ భూముల్లో ఎంజాయ్‌మెంట్ సర్వే నిర్వహించింది. జియోకాన్ సర్వే ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ సాంకేతిక సహకారంతో రెవెన్యూ, సర్వే విభాగాలు సంయుక్తంగా సర్వే నిర్వహించాయి. ఇక్కడే టీడీపీ నేతలు చక్రం తిప్పారు. అక్కడ భూములు లేకపోయినా.. కొంతమంది టీడీపీ అనుచరుల పేర్లని సర్వేలో పొందుపరిచారు. కోట్ల రూపాయల విలువ చేసే భూములను తమ కబంధ హస్తాల్లోకి తీసుకునేందుకు పావులు కదిపారు. ఈ ఎంజాయ్‌మెంట్ సర్వేలో అవకతవకలు జరుగుతున్నాయని గుర్తించిన అప్పటి ప్రతిపక్ష వైఎస్సార్ సీపీ నేతలతో పాటు బీజేపీ, వామపక్షాలు, ఇతర రాజకీయపార్టీలు వ్యతిరేకించాయి. ముదపాక భూముల్లో జరుగుతున్న అడ్డగోలు సర్వేను నిలుపుదల చేయాలంటూ ఆ భూముల వద్దనే ధర్నాలు చేశాయి. దీనిపై స్పందించిన అప్పటి అధికారులు ఎంజాయ్‌మెంట్ సర్వే పక్కాగా నిర్వహించేందుకు రెవెన్యూ, సర్వే, హార్టికల్చర్, వ్యవసాయ శాఖలతో కూడిన ఐదు బృందాలను ఏర్పాటు చేసినా.. టీడీపీ నేతలు మాత్రం తమ హస్తలాఘవాన్ని ప్రదర్శించారు. ముదపాకలో భూ రాబందులు వాలి.. ఆ భూములను కబ్జా చేసేస్తున్నాయంటూ నినదించినా.. సర్వేను బండారు, అతని అనుచరులు అనుకూలంగా మార్చేసుకున్నారు. అందుకే ఇటీవల ఆ ప్రాంతంలో నిరుపేద లబ్ధిదారులకు జగనన్న కాలనీల నిర్మాణానికి ప్రభుత్వం పూనుకుంటే.. దాన్ని అడ్డుకునేందుకు టీడీపీ నేతలు నానాయాగీ చేస్తున్నారు. తాము అడ్డగోలుగా దోచుకున్న భూములను పేదల పరం చేస్తుంటే ఓర్వ లేక ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టేందుకు న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్నారు. ప్రధానంగా అధికారులపై, ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. అయినప్పటికీ అర్హులకు అన్యాయం జరగకుండా.. పేదలకు ఇళ్ల స్థలాలు అందించేందుకు పక్కా ప్రణాళికతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళుతోంది.

హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి స్వాగతం



హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్‌కు స్వాగతం పలుకుతున్న పోర్టు అధికారులు

సాక్షి,విశాఖపట్నం/విశాఖ లీగల్: రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ రెండు రోజుల పర్యటన నిమిత్తం శనివారం సాయంత్రం విశాఖ చేరుకున్నారు. ప్రధాన న్యాయమూర్తికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్, విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు చింతపల్లి రాంబాబు, కార్యదర్శి పైలా శ్రీనివాసరావు, ఉపాధ్యక్షురాలు బి.ఎస్.లత, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు అరుణ్ కుమార్ తదితరులు స్వాగతం పలికారు. విశాఖ విమానాశ్రయం నుంచి పోర్టు గెస్ట్ హౌస్‌కు చేరుకున్న చీఫ్ జస్టిస్‌కు పోర్టు డిప్యూటీ చైర్మన్ దుర్గేష్‌కుమార్ దూబె ఆత్మీయ స్వాగతం పలికారు. పోర్టులో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి ఆయనకు వివరించారు. పోర్టు కార్యదర్శి వేణుగోపాల్ పాల్గొన్నారు.

నేడు న్యాయస్థానాల సముదాయం ప్రారంభం

విశాఖ లీగల్: అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించిన నూతన న్యాయస్థానాల సముదాయం ప్రారంభానికి సిద్ధమైంది. ఈ నేపథ్యంలో న్యాయస్థానాల సముదాయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. రూ.26 కోట్లతో నిర్మించిన ఈ సముదాయాన్ని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ఆదివారం ఉదయం 10.30 గంటలకు ప్రారంభిస్తారు. ఇందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ తెలిపారు. ప్రధాన న్యాయమూర్తితో పాటు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ యు.దుర్గాప్రసాద్, జస్టిస్ డి.వి.ఎస్ సోమయాజులు, జస్టిస్ చీమలపాటి రవి, జస్టిస్ చీకటి మానవేంద్రరాయ్, ప్రభుత్వ కార్యదర్శి జవహర్‌రెడ్డి ఈ కార్యక్రమానికి హాజరవుతున్నారు.

నేడు కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ రాక

మహారాణిపేట: కేంద్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి స్మృతి ఇరానీ ఆదివారం విశాఖ వస్తున్నారు. ఢిల్లీ నుంచి విమానంలో ఉదయం 8.15 గంటలకు విశాఖ విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడ నుంచి వాహనంలో మారియట్ హోటల్‌కు చేరుకుంటారు. అక్కడ ఉదయం 9.25 గంటలకు బీజేపీ సోషల్ మీడియా కార్యక్రమంలో పాల్గొంటారు. 12.35 గంటలకు విమానంలో ఢిల్లీ బయలుదేరుతారు.

'నర్సింగ్'లో పరిశోధనలకు ప్రోత్సాహం

వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ బాబ్జీ





మాట్లాడుతున్న హెల్త్ వర్సిటీ వీసీ బాబ్జీ, గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు పొందిన వారితో అతిథులు

ఏయూ క్యాంపస్: నర్సింగ్ విద్యలోనూ పరిశోధనలకు ప్రోత్సాహం అందిస్తామని డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ కె.బాబ్జీ అన్నారు. శనివారం విశాఖలో సెయింట్ లూక్స్, విజయ లూక్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ విద్యాసంస్థల గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ బాబ్జీ మాట్లాడుతూ.. ప్రపంచ అత్యుత్తమ నగరాల్లో విశాఖ ఒకటని.. సుందరంగా, ఆహ్లాదకరంగా ఉంటుందన్నారు. సుశిక్షితులైన నర్సింగ్ సిబ్బందిని తయారు చేసే విధంగా రాష్ట్రంలోని నర్సింగ్ కాలేజీల నిర్వహణ జరుగుతోందన్నారు. కోవిడ్ వంటి విపత్కర సమయాల్లో వీరు అందించిన సేవలను సమాజం ఎన్నటికీ మరువదన్నారు. ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్, కేజీహెచ్ పూర్వ సూపరింటెండెంట్ డాక్టర్ జి.అర్జున మాట్లాడుతూ.. వైద్యులతో సమానంగా రోగులకు నర్సింగ్ సిబ్బంది సేవలందిస్తున్నారని.. ఇలాగే వృత్తి ధర్మాలను, నైతిక విలువలను పరిరక్షించుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. నర్సింగ్ పూర్తి చేసిన వారికి విదేశాల్లో కూడా మెండుగా ఉపాధి అవకాశాలున్నాయని ఏపీ నర్సెస్ అండ్ మిడ్ వైఫ్స్ ఏఎన్‌ఎం అండ్ హెల్త్ విజిటర్స్ కౌన్సిల్ రిజిస్ట్రార్ ఆచార్య కె.సుశీల అన్నారు. అనంతరం నర్సింగ్ డిగ్రీ పూర్తిచేసిన వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కేజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి, సంస్థ చైర్‌పర్సన్ ఎం.విజయ లూక్, కరస్పాండెంట్ మమత ప్రసాద్, డైరెక్టర్ షావిలా ప్రీతం, డైరెక్టర్ షైనీ సుమన్, డైరెక్టర్ ప్రీతమ్ లూక్ తదితరులు పాల్గొన్నారు.

సిగిరెట్ కోసం చంపేశారు

- మృతుడు, నిందితులు మైనర్లే
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన

డాబాగార్డెన్స్: చిన్నపాటి తగాదా ఓ బాలుడి ప్రాణాన్ని తీసింది. జులాయిగా తిరుగుతూ.. ఆకతాయి పనులు చేస్తున్న అతని జీవితం అర్ధాంతరంగా ముగిసింది. సిగిరెట్ విషయమై ఏర్పడిన గొడవలో మైనర్లే కత్తితో బాలుడిని హత్య చేశారు. అతన్ని మృతదేహాన్ని ఎవరికీ తెలియకుండా గోనె సంచిలో కుక్కి సముద్రంలో పడేశారు. ఈ ఘటన శుక్రవారం వేకువజామున జరగ్గా.. శనివారం వెలుగులోకి వచ్చింది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలివీ. పాతనగరం ఆశిపాపవీధికి చెందిన మైనర్ జులాయిగా తిరుగుతూ.. తనను తాను చిన్న విస్కీగా పరిచయం చేసుకున్నాడు. విస్కీ అనే రౌడీషీటర్ జైలు జీవితం గడుపుతుండడంతో తానే ఇక నుంచి విస్కీ అంటూ స్థానికులను బెదిరించడం ప్రారంభించాడు. నిత్యం తగాదాలకు దిగుతూ యువకులతో గొడవ పడేవాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం వేకువజామున అదే ప్రాంతానికి చెందిన నలుగురు మైనర్లతో సిగిరెట్ విషయమై గొడవ పడ్డాడు. ఆగ్రహానికి గురైన ఆ మైనర్లు బటన్ నైఫ్‌తో బాలుడిని హత్య చేశారు. అతని మృతదేహాన్ని వారు ఓ గోనె సంచిలో కుక్కారు. ఓ ఆటోను పిలిచి వినాయక చవితికి సంబంధించి పూజా పత్రిని సముద్రంలో పడేయాలంటూ ఆటోపై మృతదేహాన్ని తీసుకెళ్లారు. ఫిషింగ్ హార్బర్ జెట్టీ–11లో పడేశారు. డ్రైవర్ ఇంటికి వెళ్లి చూసుకునే సరికి ఆటో నిండా రక్తపు మరకలు ఉండడాన్ని గ్రహించి ఆ మైనర్లను గట్టిగా ప్రశ్నించాడు. దీంతో చేసిన తప్పును ఒప్పుకుని వారు వన్‌టౌన్ పోలీసులకు లొంగిపోయారు. పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు.

ఓపెన్ స్కూల్‌లో ప్రవేశాలు

విశాఖ విద్య: సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పదో తరగతి, ఇంటర్మీడియెట్ కోర్సుల్లో చేరేందుకు ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో ఎల్. చంద్రకళ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎటువంటి అపరాధ రుసుము లేకుండా ఈ నెల 30వ తేదీలోపు ఆన్‌లైన్ ద్వారా కోర్సుల్లో చేరవచ్చని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

టీడీపీకి చెందిన వారు దాడి చేశారు

పెందుర్తి పోలీసులకు వలంటీర్ ఫిర్యాదు



దుర్గ

సింహాచలం: టీడీపీకి చెందిన వ్యక్తులు తనపై దాడి చేశారని 95వ వార్డు పాపయ్యరాజుపాలేనికి చెందిన వలంటీర్ చిట్టిబోయిన దుర్గ పెందుర్తి పోలీసులకు శనివారం ఫిర్యాదు చేసింది. లక్ష్మీపురంలోని బీసీకాలనీలో తాము నివసిస్తున్న ఇంటి వద్ద ఉన్న కాలువ విషయంలో తనని చిట్టిబోయిన మురళీకృష్ణ, గౌరీ అనే వ్యక్తులు కొట్టారని తెలిపింది. తన భర్త రాముని చిట్టిబోయిన అప్పలనాయుడు, రమణ కొట్టారని ఫిర్యాదు చేసింది. వీరంతా టీడీపీకి చెందిన వాళ్లని, తరచూ తమ ఇంటి వద్ద ఉన్న కాలువ విషయంలో గొడవపడుతూ తమపై దాడి చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొంది. ఈ విషయంపై పెందుర్తి సీఐ శ్రీనివాసరావు విచారణ జరిపారు. కాగా ఇది కుటుంబ గొడవ అని, బాధితురాలు దుర్గ బంధువులు స్టేషన్‌కి వచ్చి సమస్య పరిష్కరించుకుంటామని చెప్పారని పేర్కొన్నారు.

వచ్చే ఏడాదీ వైజాగ్ ఓపెన్ గోల్ఫ్ టోర్నీ





లీడర్ బోర్డ్‌పై హోల్ పుటింగ్‌కు ప్రయత్నిస్తున్న శివేంద్ర, అక్షయ్ శర్మకు రూ.10లక్షల చెక్కు అందిస్తున్న రాష్ట్ర సీఎస్ జవహర్ రెడ్డి

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి

విశాఖ స్పోర్ట్స్: ప్రొఫెషనల్ గోల్ఫ్ టోర్నీ వైజాగ్ ఓపెన్–2023 విజయవంతంగా ముగియడం శుభసూచికమని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్ జవహర్‌రెడ్డి అన్నారు. వైజాగ్ ఓపెన్ గోల్ఫ్ ముగింపు కార్యక్రమం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని 126 మంది మేటి ప్రొఫెషనల్స్‌తో పాటు విదేశీ గోల్ఫర్లతో విశాఖ వేదికగా ప్రతిష్టాత్మకంగా టోర్నీ నిర్వహించడం అభినందనీయమన్నారు. తొలిసారిగా ఈ తరహా టోర్నీ విశాఖ వేదికగా జరగడం మంచి పరిణామమని, వచ్చే ఏడాది కూడా విశాఖ వేదికగా ఈ టోర్నీ నిర్వహించేందుకు సన్నద్ధత వ్యక్తం చేశారు. పీజీటీఐ సీఈవో ఉత్తమ్‌సింగ్ మాట్లాడుతూ కేవలం ఒక్క పాయింట్ తేడాతో చండీగఢ్ గోల్ఫర్ అక్షయ్ శర్మపై తంగరాజా విజయకేతనం ఎగురవేయడం.. హోరాహోరీగా పోటీ జరిగిందనే విషయాన్ని తేటతెల్లం చేస్తుందన్నారు. దేశంలోని గోల్ఫ్ కోర్స్‌లో విశాఖ కోర్స్ చాలా కఠినతరమైదన్నారు. ఇక్కడ తొలిసారిగా ప్రొఫెషనల్ గోల్ఫ్ జరిగిందని.. చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణం ఇక్కడ ప్రత్యేకతన్నారు. ఈస్ట్‌పాయింట్ గోల్ఫ్ కోర్స్ కార్యదర్శి ఎంఎస్ఎన్ రాజు మాట్లాడుతూ టోర్నీ విజయవంతంలో ఎందరో కృషి ఉందన్నారు. వచ్చే ఏడాది నవంబర్‌లో టోర్నీ నిర్వహించేలా పీజీటీఐ ప్రణాళిక సిద్ధం చేయాలని కోరారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ సహకారం మరువలేనిదన్నారు. కాగా.. వైజాగ్ ఓపెన్ గోల్ఫ్ టోర్నీ నాలుగు రోజుల పాటు ఉత్కంఠగా సాగింది. ప్రతి రౌండ్‌లోనూ విజేతగా నిలిచేందుకు గోల్ఫర్లు పోటీ పడగా.. నాలుగు రౌండ్లలో నలుగురు విజేతలుగా నిలిచారు. చివరికి టైటిల్‌ను మాత్రం కొలంబోకు చెందిన ఎస్.తంగరాజా గెలుచుకోవడం కొసమెరుపు. కోటి రూపాయల నగదు ప్రోత్సాహకాలను కటాఫ్‌తో మూడు, నాలుగు రౌండ్ల ఆటలో సత్తాచాటిన 53 మందికి కమిటీ అందించగా.. తొలి రెండు స్థానాల్లో నిలిచిన తంగరాజా రూ.15లక్షలు, రన్నరప్‌గా నిలిచిన అక్షయ్ రూ.10 లక్షల బహుమతులను అతిథుల చేతులమీదుగా అందుకున్నారు. కార్యక్రమంలో క్లబ్ కార్యవర్గం పాల్గొంది.

మహిళ మెడలో బంగారు నల్లపూసల దండ చోరీ

నిందితుడికి స్థానికుల దేహశుద్ధి



చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన దినేష్

గోపాలపట్నం: రైల్వేస్టేషన్ వంతెనపై ఓ మహిళ మెడలోని గొలుసు దొంగతనం చేసిన వ్యక్తిని స్థానికులు పట్టుకుని దేహశుద్ధి చేశారు. వివరాలివీ.. చంద్రనగర్‌కు చెందిన తుంపాల చిన్ని శనివారం ఉదయం పని మీద గాజువాక వెళ్లింది. పని ముగించుకుని సాయంత్రం నాలుగు గంటల సమయంలో రైల్వేస్టేషన్ ఫుట్ ఓవర్ వంతెనపై నుంచి చంద్రనగర్‌కు వెళ్తోంది. ఆ సమయంలో దినేష్ అనే వ్యక్తి ఆమె మెడలోని మూడు తులాల బంగారు నల్లపూసల దండను తెంచుకుని పరుగు తీశాడు. దీంతో ఆమె కేకలు వేస్తూ అతని వెంట పరుగు తీసింది. పాత గోపాలపట్నం వద్ద ఆమె కేకలు విన్న స్థానికులు నిందితుడిని పట్టుకుని దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. గోపాలపట్నం ఎస్ఐ అప్పలనాయుడు, క్రైం ఎస్ఐ నర్సింగరాజు బాధితురాలి నుంచి వివరాలు సేకరించారు. నిందితుడు దినేష్‌ది ప్రహ్లాదపురం. ఓ షాపింగ్ మాల్‌లో పని చేస్తున్నాడు. చెడు వ్యసనాలకు అలవాటు పడి అప్పుల పాలయ్యాడు. ఈ క్రమంలో చైన్ స్నాచింగ్‌కు పాల్పడి అరెస్టయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



నిమజ్జనం కోసం తీరానికి తీసుకొచ్చిన విగ్రహాలతో చిన్నారులు, మహిళలు

బై.. బై.. గణేశా..



తాటిచెట్లపాలెం: నగరంలో వినాయక చవితి మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా పలు ఉత్సవ కమిటీలు పంచరాత్రి మహోత్సవాలు నిర్వహించి.. విగ్రహాలను శనివారం రాత్రి పెదజాలరిపేట వద్ద సముద్రంలో నిమజ్జనం చేశారు. భక్తులను బీచ్‌లోకి అనుమతించలేదు. వీరి వద్ద నుంచి గజ ఈతగాళ్లు విగ్రహాలను తీసుకుని.. సముద్రంలో నిమజ్జనం చేశారు.

